సాక్షి కామారెడ్డి

మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



రాజకీయాలు తగవు

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయాలు మానుకోవాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ప్రభుత్వానికి సూచించారు.

- 10లో ▸



ప్రజల సహకారంతోనే..

జిల్లాలో సాధారణ పరిస్థితులను తీసుకురావడంలో ప్రజలు ఎంతగానో సహకరించారని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0 /21.5

ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి



కామారెడ్డి క్రైం : జిల్లాలో మంగళవారంనుంచి మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షం అనంతరం జిల్లాలో చేపట్టిన మరమ్మతు పనులను వేగవంతం చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. గురుకుల విద్యాలయాలతోపాటు అవసరమైన ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి జ్వరాలపై సర్వే చేయాలని సూచించారు. పునరుద్ధరణ పనులకు సంబంధించిన పురోగతిపై ప్రతిరోజూ నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి అధికారి స్థానికంగా అందుబాటులో ఉండాలని, ఎలాంటి సెలవులు లేవని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఆర్డీవో వీణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు కట్టపై భారీ గుంత



బీబీపేట: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై సోమవారం తెల్లవారుజామున భారీ గుంత ఏర్పడింది. అయిదు రోజుల క్రితం చెరువు కట్టకు బుంగ పడ్డ చోటే మళ్లీ గుంత ఏర్పడడంతో అధికారులు, ప్రజలు వెంటనే స్పందించి ట్రాక్టర్ల ద్వారా మట్టిని నింపారు. భారీ గుంత ఏర్పడ్డప్పటికీ నీళ్లు మాత్రం లీక వలేదు. వెంటనే మట్టిని నింపడంతో ప్రమాదం తప్పింది. ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న పనులను సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసి, రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

'ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది'



కామారెడ్డి టౌన్: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం ద్వారా ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు శ్రీనివాస్, రాజేశ్వర్, శంకర్, కిరణ్, సిద్ధిక్, లక్కపతిని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని యువతీయువకులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ప్రాంతీయ ముఖ్య అధికారి నవీన్ రెడ్డి పేర్కొన్నారు. అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమైన అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్‌పై సమగ్ర శిక్షణ ఉంటుందన్నారు. జావా, డేటాబేస్, పైథాన్ వంటి ఆధునిక టెక్నాలజీతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఐసెట్ కోచింగ్ కూడా అందుబాటులో ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు రుసుము రూ. 599 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7013675052 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సమష్టిగా కదిలి..

విపత్తును ఎదుర్కొని..

- వరదల్లో చిక్కుకున్న 775 మందిని కాపాడాం
- 2,478 మందిని పునరావాస కేంద్రాలకు తరలించాం
- విద్యుత్ పునరుద్ధరించాం.. రోడ్లు సరి చేస్తున్నాం..
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : "జిల్లాలో ఆ మూడు రోజుల్లో కురిసిన కుంభవృష్టితో భారీ వరదలు వచ్చాయి. దీంతో ప్రజలను కాపాడేందుకు యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. ప్రాణాలకు తెగించి వందలాది మందిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు చేర్చింది. అధికార యంత్రాంగం రేయింబవళ్లు కష్టపడడం వల్లే త్వరగా తేరుకున్నాం" అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. తనతోపాటు రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, ఫైర్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, రెస్క్యూ టీంలు మొత్తంగా 2 వేల మంది రాత్రింబవళ్లు కష్టపడ్డారన్నారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వరదలు, నష్టం, బాధితులను ఆదుకోవడానికి తీసుకున్న చర్యలు, పరిహారం తదితర అంశాలపై 'సాక్షి' సోమవారం కలెక్టర్‌ను ఇంటర్వ్యూ చేసింది. వర్షాలతో జిల్లాలో జరిగిన నష్టం, ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

■ మూడు రోజుల్లోనే నలభైశాతం వానలు..

జిల్లాలో ఏడాది మొత్తంలో కురిసే సాధారణ వర్షపాతం 983.4 మిల్లీ మీటర్లు. అయితే ఆ మూడు రోజుల్లో(గతనెల 27, 28, 29 తేదీల్లో) 399.8 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. ఏడాది మొత్తంలో కురవాల్సిన దాంట్లో దాదాపు 40 శాతం మూడు రోజుల్లోనే కురియడంతో ఒక్కసారిగా వాగులు పొంగి ప్రవహించాయి. ఫలితంగా అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఇది ఊహించని విపత్తు. ఊహకందని రీతిలో కురిసిన భారీ వర్షం ఎన్నో ఇబ్బందులను తెచ్చిపెట్టింది.

■ ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు పరిహారం..

జిల్లాలో పూర్తిగా కూలిపోయిన నాలుగు ఇళ్లతో పాటు పాక్షికంగా దెబ్బతిన్న 1,224 ఇళ్లకు పరిహారం కింద రూ. 43.80 లక్షలు మంజూరు చేశాం. బాధితుల అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయి. వరదలలో చిక్కుకున్న వారికోసం 58 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 740 కుటుంబాలకు సంబంధించిన 2,478 మందికి పునరావాసం కల్పించాం. పరిస్థితి చక్కబడడంతో 54 కేంద్రాలు ఖాళీ అయ్యాయి. ఇంకో నాలుగు కేంద్రాల్లో 37 మంది ఉన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థలు సాయం అందిస్తున్నాయి.



పోచారం ప్రాజెక్టు వద్ద తాత్కాలిక మరమ్మతులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ (ఫైల్)



జీఆర్ కాలనీలో బాధితుడితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ (ఫైల్)

■ 334 గ్రామాల్లో పంటలకు నష్టం..

జిల్లాలో 334 గ్రామాల్లో 49,984 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 37,267 మంది రైతులకు నష్టం వాటిల్లింది. పంటలకు జరిగిన నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపించాం. హార్టికల్చర్‌కు సంబంధించి 44 ఎకరాల్లో 33 శాతంకన్నా ఎక్కువగా, 96 ఎకరాల్లో 33 శాతంకన్నా తక్కువగా దెబ్బతిన్నాయి.

■ నలుగురు మనుషులు, 108 మూగజీవాలు మృతి..

జిల్లాలో వర్షాలు, వరదలతో నలుగురు చనిపోయారు. రాజంపేట, దోమకొండ, బీబీపేట, కామారెడ్డిలలో ఒక్కొక్కరు మృతిచెందారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందుతుంది. అలాగే 108 పశువులు, 47,570 కోళ్లు చనిపోయాయి.

■ 145 చెరువులకు మరమ్మతులు అవసరం

జిల్లాలో 157 చెరువులు దెబ్బతిన్నాయి. 12 చెరువులకు అప్పటికప్పుడు మరమ్మతులు చేయించాం. 145 చెరువులకు మరమ్మతులు చేయాల్సి ఉంది. 80 చెరువులు పర్మినెంట్‌గా, 65 చెరువులకు తాత్కాలిక పనులు చేపట్టాల్సి ఉంది. పోచా రం ప్రాజెక్టుకు వరద రెండింతలు అదనంగా రావడంతో ఒత్తిడి పెరిగి కట్టకు డ్యామేజీ జరిగింది. తా త్కాలిక మరమ్మతులు పూర్తయ్యాయి. శాశ్వత మరమ్మతులకోసం ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించాం.

■ రోడ్లను పునరుద్ధరిస్తున్నాం...

జిల్లాలో దెబ్బతిన్న చాలా రోడ్లలో రాత్రింబవళ్లు కష్టపడి ఇప్పటికే కొన్నింటిని పునరుద్ధరించాం. జాతీయ రహదారులు రెండుచోట్ల దెబ్బతినగా.. మరమ్మతులు చేయించడంతోరాకపోకలు సాగుతున్నాయి. జిల్లాలో 116 ఆర్‌అండ్‌బీ రోడ్లు, కల్వర్టులు దెబ్బతినగా 113 రోడ్లను పునరుద్ధరించాం. ఇంకా మూడింటిని చేయాల్సి ఉంది. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 122 రోడ్లు, కల్వర్టులు దెబ్బతినగా 32 పునరుద్ధరించాం. 38 హ్యాబిటేషన్లలో మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

జిల్లాలో వరదలతో దెబ్బతిన్న వాటికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడానికి రూ. 37.99 కోట్లు, శాశ్వత పనుల కోసం రూ. 210.60 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశాం. వరదలతో తలెత్తిన ఇబ్బందుల నుంచి బయటపడేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆర్డీవోలు, సబ్ కలెక్టర్‌కు రూ. 30 లక్షలు అందించాం.

■ అప్రమత్తంగా ఉన్నాం...

మళ్లీ వర్షాలు వస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉంది. అర్ధరాత్రి వేళల్లో కూడా తాము ప్రజలకు అందుబాటులో ఉంటాం. బీబీపేట చెరువుకు బుంగ పడిందంటే అర్ధరాత్రి వెళ్లి అక్కడ చర్యలు తీసుకున్నాం. జిల్లా అధికారులు, ఉద్యోగులందరూ ఎంతో శ్రమించడం వల్లే త్వరగా తేరుకోగలిగాం. మళ్లీ వర్షాలు వస్తే నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రాణాలకు తెగించి రెస్క్యూ ఆపరేషన్లు..

ఒక్కసారిగా వరదలు చుట్టుముట్టడంతో చాలా మంది చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు వెంటనే రంగంలోకి దిగాం. పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందరూ కలిసి ప్రాణాలకు తెగించి రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించారు. జిల్లాలో 60 మంది ఉన్న రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, 142 మంది ఉన్న ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, ఐదు ఎమర్జెన్సీ టీంలు కలిపి 17 చోట్ల రెస్క్యూ చేసి మొత్తం 775 మందిని కాపాడారు. కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ, హౌజింగ్‌బోర్డు తదితర ప్రాంతాల్లో 276 మందిని వరదల నుంచి తరలించాం. అలాగే ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని వరదలు చుట్టేయడంతో.. అందులో ఉన్న 300 మంది విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు పంపించాం. రాజంపేట మండలంలో 29 మందిని, మారంపల్లి గ్రామంలో వంద మందిని, ఉగ్రవాయిలో 50 మందిని, సర్వ-అన్నాసాగర్ వద్ద తొమ్మిది మందిని, మిగతా చోట్ల మరికొందరిని ఎస్డీఆర్ఎస్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడాయి.



తాడ్వాయిలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తూ.. (ఫైల్)

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'

కామారెడ్డి అర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో జంగ్ సైరన్ పేరిట పెన్షన్ విద్రోహదినం నిర్వహించారు. నల్లచొక్కాలు, బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు కోసం అక్టోబర్ 12న నిర్వహించే ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ సెక్రెటరీ జనరల్ దేవేందర్, కో చైర్మన్ ఆకుల బాబు, ప్రతినిధులు చింతల లింగం, ముల్క నాగరాజు, సాయిరెడ్డి, ఎల్లారెడ్డి, మనోహర్ రావు, హన్మంత్‌రెడ్డి, నిట్టు విఠల్‌రావు, విజయరామరాజు, లింగం, భాస్కర్‌రెడ్డి, ముజీబుద్దీన్, నిజాం, ప్రభాకర్, బట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జేఏసీ నాయకులు

నాణ్యమైన విద్య అందించేందుకు సహకరించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు సహకరించాలని వీసీ యాదగిరిరావు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను కోరారు. అసోసియేషన్ సభ్యులు వీసీతోపాటు రిజిస్ట్రార్ యాదగిరిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వారిని సన్మానించారు. అనంతరం అకడమిక్ ఆడిట్ సెల్ డైరక్టర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ ప్రొఫెసర్ కే.సంపత్‌కుమార్‌ను కలిసి సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరాల సుధాకర్, కోశాధికారి శ్రీనివాస రాజు, ఉపాధ్యక్షుడు హకీం, అసోసియేట్ ప్రెసిడెంట్ సంజీవ్ సీతారాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరిప్రసాద్, సూర్యప్రకాశ్, సృజన్, సంయుక్త కార్యదర్శి నవీన్‌యాదవ్, సలహాదారులు మారయ్యగౌడ్, నిశిత రాజు, శ్రీనివాస్, గిరి, విజయ్, దత్తు, రమణ పాల్గొన్నారు.

'రెండు పంటలకు ఢోకా లేదు'

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా మారినందున ఆయకట్టు కింద రెండు పంటలకు సాగు నీటికి ఢోకా లేదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రధాన జలాశయాల నుంచి జూన్ మాసంలో ఆయకట్టు పంటలకు నీటి విడుదల చేపట్టిన ఘనత నిజాంసాగర్ ప్రాజెక్టుకు దక్కిందన్నారు. గత ఆరేళ్లుగా నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు జూన్ మాసంలో నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడంతో ఆయకట్టు కింద రైతులు ముందస్తుగానే పంటలు సాగు చేశారన్నారు. దీంతో ఎరువుల కొరత లేదన్నారు.



నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్

యూరియా.. సరిపోతలేదయా..

భిక్కనూరు: జిల్లాను యూరియా కొరత వేధిస్తోంది. అరకొరగా సరఫరా అవుతుండడంతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. యూరియా లారీ వచ్చిందని తెలియగానే సొసైటీలకు పరుగులు తీస్తున్నారు. భారీ క్యూలలో గంటల తరబడి వేచి ఉంటున్నా చాలామందికి ఒక్క బస్తా కూడా దక్కడం లేదు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పెద్దమల్లారెడ్డి సొసైటీకి యూరియా వచ్చిందని తెలియగానే రైతులు తరలివచ్చారు. క్యూలైన్‌లో పాస్‌బుక్కులు, చెప్పులు, రాళ్లు, ఇటుకలు, ఇతర వస్తువులు ఉంచారు. 670 బస్తాల యూరియా రాగా.. వెయ్యి మందికిపైగా క్యూలో ఉన్నారు. భారీగా రైతులు తరలిరావడంతో గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు గంటల్లో 670 మందికి ఒక్కో బస్తా చొప్పున అందించారు. మిగిలినవారు నిరాశతో వెనుదిరిగారు.



పెద్దమల్లారెడ్డిలో పోలీసుల పర్యవేక్షణలో యూరియాను పంపిణీ చేస్తున్న దృశ్యం

మాచారెడ్డి ఉమ్మడి మండలంలో..

మాచారెడ్డి : మాచారెడ్డి మండలంలోని సోమారంపేట, పాల్వంచ మండలంలోని ఫరీదుపేటలో సోమవారం యూరియా పంపిణీ చేశారు. ఉమ్మడి మాచారెడ్డి మండలానికి 900 బస్తాల యూరియా రాగా.. వేల సంఖ్యలో రైతులు తరలివచ్చి బారులు తీరారు. రైతులు ఎక్కువగా ఉండడం, బస్తాలు తక్కువగా ఉండడంతో అధికారులు ఒక్కొక్కరికి ఒక బస్తా మాత్రమే ఇచ్చారు. అయినా చాలామందికి యూరియా దక్కలేదు. దీంతో ప్రభుత్వం తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేశారు. సరిపడా యూరియా తెప్పించాలని కోరారు.



సోమారంపేటలో బారులు తీరిన రైతులు



పెద్దమల్లారెడ్డిలో క్యూలో వివిధ వస్తువులు ఉంచిన రైతులు

రవాణా సౌకర్యాలను పునరుద్ధరించాం

- సీఎంతో వీసీలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: వరదలతో దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేసి రవాణా సౌకర్యాలను పునరుద్ధరించామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు తదితరులు కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. భారీ వర్షాలు, వరద సహాయం తదితర అంశాలపై సమీక్షించి, పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో అన్ని రకాలుగా అధికారులను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్ చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్ చందర్ నాయక్, అధికారులు

కూరగాయల ధరలకు రెక్కలు

ఎల్లారెడ్డిరూరల్: భారీ వర్షాలతో అష్టకష్టాల పాలైన జిల్లా ప్రజలను కూరగాయల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకు మండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో వారం రోజుల్లో దాదాపు అన్ని కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ఆలుగడ్డలు మినహా ప్రతి కూరగాయ కిలోకు రూ. 60 నుంచి 120 రూపాయలు పలుకుతున్నాయి. ఆలుగడ్డను కిలోకు రూ. 30 కి విక్రయిస్తుండగా.. టమాటలు కిలో రూ. 60, బెండకాయ, క్యాబేజీ, వంకాయ, పచ్చిమిర్చి రూ. 80, చామగడ్డ, క్యాప్సికం, కాకరకాయ, క్యారెట్ రూ. 100, చిక్కుడు కాయ రూ. 120 కి అమ్ముతున్నారు. భారీ వర్షాలు, వరదలతో పంట దెబ్బతినడం వల్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.



ఎల్లారెడ్డిలో కూరగాయలు కొంటున్న ప్రజలు

క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



పిట్లం(జుక్కల్): పిట్లం ఏఎంసీ కార్యలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. మొత్తం 31 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 25 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. తహసీల్దార్ రాజు నరేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఇమ్రోజ్, మండల అధ్యక్షుడు జంబిగ హనుమాండ్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మర్పల్లిలో శుద్ధ జలాలు..



నిజాంసాగర్(జుక్కల్): మర్పల్లి గ్రామస్తులకు సోమవారం పిట్లం పట్టణానికి చెందిన ఆర్ఎస్ఎస్ నాయకులు శుద్ధ జలాలను పంపిణీ చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు 20 గేట్ల ద్వారా నీటి విడుదల చేపట్టడంతో మర్పల్లి గ్రామాన్ని అధికారులు ఖాళీ చేయించి పునరావాసానికి పంపారు. ప్రాజెక్టు నుంచి నీటిని తగ్గించడంతో గ్రామస్తులు వారి ఇళ్లకు చేరుకున్నారు. అయితే గ్రామంలో తాగునీటి సరఫరా లేకపోవడంతో ఆర్ఎస్ఎస్ బృందం సభ్యులు గ్రామస్తులకు శుద్ధ జలాలను సరఫరా చేశారు. నాయకులు కోటరాజులు గుప్తా, రాము, అశోక్, పండరి, విజయ్, రవిచంద్ర, అభయాంజనేయ ఆలయ ధర్మకర్త మెంగారం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు..



పిట్లం(జుక్కల్): పిట్లం కస్తూర్బా బాలికల పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 60 మంది పేద విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక వ్యాపారవేత్త పుట్నాల భగవాన్ సేట్ బ్రదర్స్ వారి మాతృమూర్తి మొదటి వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి బాలు, రీజియన్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్, సభ్యులు, హెచ్ఎం సరిత, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బాన్సువాడ రూరల్: కామారెడ్డి జిల్లాలో ఈ నెల 2 నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, డివిజన్‌లోని అధికారులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కొప్పిసెట్టి కిరణ్మయి సోమవారం అన్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు జరిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. అధిక వర్షాలు కురిస్తే గ్రామస్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలను, శిథిలావస్థకు చేరి కూలిపోయే ఇళ్లను ముందుగా గుర్తించాలన్నారు. మత్స్యకారులు, మేకలు, గొర్ల కాపరులు నీటి పరివాహక ప్రాంతాలకు వెళ్లొద్దని హెచ్చరించారు.

ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 46 వినతులు



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి 46 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో భూ సంబంధిత రెవెన్యూ సమస్యలు, పింఛన్‌లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులకు సంబంధించినవి ఎక్కువగా వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. ఆ వెంటనే పరిష్కారాలకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేపట్టాలన్నారు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనీ, పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

10 నెలల నుంచి జీతాలు రాలేదు

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలకు 10 నెలలుగా జీతాలు రాలేదని జిల్లా గిరిజన విద్యార్థి సంఘం నాయకులు వినోద్ నాయక్, గణేష్ నాయక్‌లు తెలిపారు. జీతాలు రాక ఏఎన్ఎంలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టళ్లలో దాదాపు 20 మంది ఏఎన్ఎంలు పని చేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.



గిరిజన విద్యార్థి సంఘం నాయకులు

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



గాంధారిలో పూజలు చేస్తున్న ఎస్సై ఆంజనేయులు దంపతులు, బీజేపీ నేత సాయిబాబా దంపతులు



మెంగారంలో వినాయక శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు



భిక్కనూరులో.. వినాయకుడి శోభాయాత్ర



మద్నూర్ గురుకుల పాఠశాలలో శోభాయాత్ర



దోమకొండలో వినాయక నిమజ్జనం సందర్భంగా నృత్యాలు చేస్తున్న మహిళలు



కామారెడ్డి జిల్లా కేంద్రంలో..

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం భక్తులు గణేశ్ మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. వివిధ మండపాల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మరో వైపు గణేశ్ శోభాయాత్రలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గణేశ్ మండపాలకు లడ్డూల పంపిణీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల నిర్వాహకులకు రైతు రామ రాజ్యం సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ నిర్వాహకుడు, బీజేపీ జిల్లా నాయకుడు జిల్లాల రమేశ్ రెడ్డి గణేశ్ లడ్డూలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ప్రతి గణేశ్ మండపాలకు ఉచితంగా లడ్డూలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పదోన్నతులు బాధ్యతల్ని పెంచుతాయి



కామారెడ్డి క్రైం: పదోన్నతులు బాధ్యతను పెంచుతాయని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన పోలీసులను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఎస్పీ స్వయంగా పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరింత బాధ్యతగా పని చేయాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పని చేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు(నస్రుల్లాబాద్ పీఎస్), రమేష్ గౌడ్(తాడ్వాయి పీఎస్) శ్రీనివాస్(బీర్కూర్ పీఎస్), దామోదర్ (రాజన్న సిరిసిల్లా నుంచి పదోన్నతిపై కామారెడ్డికి) లకు పదోన్నతులు లభించాయని తెలిపారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో వారందరి ఓట్లు ఒకే వార్డులో ఉండాలి



భిక్కనూరు: వచ్చే స్థానిక ఎన్నికల్లో ఇంట్లో వారందరి ఓట్లు అన్నీ ఒకటే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌టీపీ ప్రతినిధి గంగ్ల రవీందర్ సోమవారం భిక్కనూరు తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్కొక్కరివి ఒక్కో వార్డులో ఉన్నాయని, దీని వల్ల ఓటర్లకు ఇబ్బంది కలిగిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి కుటుంబంలోని వారి ఓట్లను ఒకటే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గండ్లతో కోలుకోలేకపోతున్న రైతులు



నాగిరెడ్డిపేట శివారులోని పటేల్ చెరువుకు పడిన గండి



మాల్తుమ్మెద ఊరచెరువుకు పడిన గండి

- ధ్వంసమైన పోచారం ప్రధాన కాలువ
- పంట పొలాల్లో చేరిన రాళ్లు, ఇసుకమేటలు



నాగిరెడ్డిపేట సమీపంలోని పంట పొలాల్లో చేరిన రాళ్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీవర్షాలు మిగిలిన నష్టంతో నాగిరెడ్డిపేట మండలంలో రైతులు కోలుకోలేక పోతున్నారు. నాగిరెడ్డిపేట గ్రామశివారులోని పటేల్ చెరువుకు గండి పడడంతో దిగువన ఉన్న పంటపొలాలను పూర్తిగా ముంచెత్తింది. వరదనీటి తాకిడికి పంటపొలాల్లో పెద్ద పెద్ద రాళ్లు, ఇసుక మేటలు వేశాయి. పంటపొలాల్లో చేరిన రాళ్లను, ఇసుక మేటలను ఎలా తొలగించుకోవాలో తెలియక బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు మండలంలోని మాల్తుమ్మెద గ్రామశివారులోని ఊరచెరువుకు గండిపడడంతో చెరువునీరు పక్కనే ఉన్న పోచారం ప్రధాన కాలువను ధ్వంసం చేసింది. దీంతోపాటు చెరువుల్లోని నీరు పూర్తిగా దిగువకు వెళ్లిపోయి ఖాళీ అయ్యాయి.

'కాళేశ్వరం'పై రాజకీయాలు తగవు

- మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం(జుక్కల్): కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆయన సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టు విచారణను సీబీఐకి అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి పిట్లం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హన్మంత్ సింధే మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు కేంద్ర ప్రభుత్వం మిలిటరీ బలగాలను మోహరించాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర రైతాంగాన్ని కాపాడాలనే సదుద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి 46 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి లేనిపోని ఆరోపణలు చేస్తూ రైతుల ఉసురుపోసుకుంటున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కృంగిపోతే దానిని మరమ్మతులు ఎలా చేసి రైతులకు నీటిని అందించే ఆలోచన చేయకుండా, కేసీఆర్‌పై నేరం మోపి జైలుకు పంపించాలని చూడటం సరైన విధానం కాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దురుద్దేశంతో కేసీఆర్‌పై లేనిపోని నిందలు మోపి దొంగగా చిత్రీకరించాలని చూస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో మాజీ మంత్రి హరీష్ రావు అరటిపండు వొలిచిన విధంగా నివేదికను ఉంచితే, 32 సార్లు అడ్డుతగిలారని అన్నారు. ఘోష్ కమిషన్ తమ నివేదికలో ఎక్కడ కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో ఆర్థిక అవకతవకలు జరిగాయని పేర్కొనలేదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నిజాంసార్ ప్రాజెక్టులోకి నీరు రావాలని.. నిజాంసాగర్ నుంచి నాగమడుగు ఎత్తిపోతల పథకానికి నీరు వస్తే జుక్కల్ నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని, ఈ విషయాన్ని రైతాంగం గమనించాలన్నారు. పిట్లం బీఆర్ఎస్ అధ్యక్షుడు వాసరి రమేష్, సీనియర్ నాయకులు అన్నారం వెంకటరామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరికెల, మాజీ ఎంపీపీ కవిత, నేతలు విజయ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, జొన్న శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, షేక్ కరీం, నర్సాగౌడ్, తదితరులున్నారు.

ప్రజల సహకారంతోనే సాధారణ పరిస్థితులు

- ఎస్పీ రాజేష్ చంద్ర



డ్రైవర్లు, మున్సిపల్ సిబ్బందితో ఎస్పీ

కామారెడ్డి క్రైం: గతంలో ఎన్నడూ లేని విధంగా వరదలు జిల్లాను ముంచెత్తినా సాధారణ పరిస్థితులు వచ్చేలా కృషి చేయడంలో అధికార యంత్రాంగానికి ప్రజల సహకారం ఎంతగానో లభించిందని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. ఎంతో మంది వివిధ వర్గాలకు చెందిన వారు కష్ట కాలంలో ప్రమాదాలను సైతం లెక్క చేయకుండా ముందుకు వచ్చి ప్రజల ప్రాణాలు కోల్పోకుండా శ్రమించారని అన్నారు. విపత్కర పరిస్థితుల్లో జిల్లా పోలీసులు అంకితభావంతో పని చేశారని కొనియాడారు. వరదల్లో ఇతరుల ప్రాణాలు కాపాడిన వారిని, రాత్రింబవళ్లు పని చేసిన జేసీబీ డ్రైవర్‌లు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లు, యువకులను, సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. జీఆర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో వరదల్లో చిక్కుకున్న దాదాపు 500 మందిని భారీ వరదలోనే సురక్షిత ప్రాంతాలకు తరలించిన పట్టణ సీఐ నరహరి, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. పునరావాసాల్లో ఆహారం పంపిణీ చేసిన వారికి, సహాయక చర్యల్లో పాలుపంచుకున్న వారికి జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, రూరల్ సీఐ రామన్, భిక్కనూర్ సీఐ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్, కామర్స్ సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి తాత్కాలిక ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ విభాగాల్లో ఒక్కో పోస్టు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 2న సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఈ నెల 3న ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల(కామారెడ్డి)లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. నెట్, సెట్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఇంటికి వచ్చి పింఛన్ పంపిణీ చేయాలి



భిక్కనూరు: వృద్ధులు, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి, దివ్యాంగులకు ఇంటింటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇవ్వాలని పెద్దమల్లారెడ్డి బీఆర్ఎస్ నేతలు సోమవారం భిక్కనూరు ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డిని కోరారు. ఈమేరకు వినతి పత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ కోడూరి సాయగౌడ్, నేతలు రాజలింగం, మంద లింగం పాల్గొన్నారు.

పీజీ పరీక్షల్లో ఒకరి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ, బీఈడీ, బీపీఎడ్ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం ఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పీజీ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 744 మందికి 688 మంది హాజరు కాగా 55 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఒకరు డిబార్ అయినట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన బీఈడీ, బీపీఎడ్ 2, 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో మొత్తం 129 మందికి 115 మంది హాజరు కాగా 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు నీట మునిగి ఒకరి మృతి



అశోక్ (ఫైల్)

వర్ని: మోస్రా మండలం తిమ్మాపూర్‌కు చెందిన వడ్ల అశోక్ (35)చింతకుంట చెరువులో తూము వద్ద ఇసుక బస్తాలు వేస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు వర్ని ఎస్సై మహేశ్ తెలిపారు. చెరువు తూము నుంచి నీరు వృథాగా పోతున్నందున కట్టడి చేసేందుకు సోమవారం ఇసుక బస్తాలు వేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి..



రెంజల్: మండల కేంద్రంలో ఓ వాహనం ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రెంజల్ ఎస్సై చంద్రమోహన్ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి వీరన్నగుట్ట నుంచి సాటాపూర్ వైపు నడుచుకుంటు వస్తున్న ఓ యువకుడిని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏడు లారీలు సీజ్



ఆర్మూర్ టౌన్: మండలంలోని గోవింద్‌పేట్ లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు లారీలను సీజ్ చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ సోమవారం తెలిపారు. భీమ్‌గల్ మండలం బెజ్జోరా గ్రామం వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గోవింద్‌పేట్‌లో లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరవ టౌన్ పీఎస్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై వెంకట్రావు సోమవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. మృతుడి ఒంటిపై క్రీమ్ కలర్ డబ్బాల షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, షర్ట్ కాలర్‌పై క్లాసిక్ టైలర్స్, నవీపేట్ అని ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659848, 8712659734 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

'దేశాభివృద్ధిలో ఎల్ఐసీ పాలసీదారులు'



ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

కామారెడ్డి అర్బన్: ఎల్ఐసీ పాలసీలు తీసుకున్న ప్రతి పాలసీదారుడు ప్రత్యక్షంగా, పరోక్షంగా దేశాభివృద్ధికి తన వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నారని ఎల్ఐసీ కామారెడ్డి శాఖ మేనేజర్ ఎస్.కృష్ణమోహన్, ఐడీబీఐ కామారెడ్డి శాఖ మేనేజర్ రాజు అన్నారు. సోమవారం ఎల్ఐసీ సంస్థ 69వ వ్యవస్థాపక దినోత్సవం, బీమా వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐడీబీఐ మేనేజర్ రాజు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఎల్ఐసీ మేనేజర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ..గత ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ తన లాభంలో కేంద్ర ప్రభుత్వానికి రూ.7,324 కోట్లను డివిడెండ్ రూపంలో చెల్లించిందని, పరోక్షంగా రూ. వేల కోట్ల పన్నులు చెల్లిస్తుందని అన్నారు.

ఎల్ఐసీ ప్రాత కీలకం

కామారెడ్డి అర్బన్: ప్రతి భారతీయుడు ఎల్ఐసీ పాలసీని తీసుకోవాలని, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఎల్ఐసీ డే కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల బీమా పాలసీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సోమవారం వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

భార్య మృతి తట్టుకోలేక..



సాయి మృతదేహం

ఇందల్వాయి: భార్య మృతి తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లవెల్లికి చెందిన నీరడి గంగాధర్, హేమలతకు 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరగడంతో హేమలత గత శనివారం వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది. భార్య మృతిని తట్టుకోలేక గంగాధర్(34) గన్నారం గ్రామంలో తన చిన్నమ్మ వాళ్ల ఇంట్లో సోమవారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజుల వ్యవధిలో భార్యా భర్తలు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. మృతుడి తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

భూమి రిజిస్ట్రేషన్ చేయించలేదని..



గంగాధర్(ఫైల్)

ఖలీల్‌వాడి: తనకు రావాల్సిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించలేదనే బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరో టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అర్సపల్లికి చెందిన సాయిలు(38) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. సాయిలు అక్క భర్తతో కొన్నేళ్ల క్రితం విడాకులు తీసుకొని తల్లి వద్దే ఉంటోంది. కాగా సాయిలుకు చెందిన భూమిని అక్క రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో కొన్ని రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీనిపై పెద్ద మనుషుల సమక్షంలో భూమిని రిజిస్ట్రేషన్ చేయించడానికి కొంత నగదును డిపాజిట్‌గా సాయిలు తన అక్కకు చెల్లించినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. అయినా అక్క భూమి రిజిస్ట్రేషన్ చేయడానికి మెలికవేయడంతో సోమవారం సాయంత్రం సాయిలు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..

బీబీపేట: మద్యానికి బానిసైన ఒకరు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు బీబీపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఎల్లమైన సాయి(27)కి చిన్ననాడే తల్లితండ్రులు చనిపోయారు. అతని పెద్దమ్మనే సాయి, తమ్ముడు నవీన్‌ను చేరదీసింది. కొంత కాలంగా సాయి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. శనివారం సాయంత్రం తన జన్మదిన వేడుకలను స్నేహితుల మధ్య జరుపుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. స్థానిక చెరువు కట్టపై నిలబడి తాను చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబీకులకు ఫోన్ ద్వారా తెలిపాడు. వెంటనే కుటుంబీకులు చెరువు వద్దకు వెళ్లి గాలింపు చేపట్టగా ఆచూకీ లభించలేదు. అధికారులు ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఆదివారం, సోమవారం బోట్ ద్వారా చెరువులో గాలించారు. సాయంత్రం సాయి మృతదేహం లభ్యమైంది. మృతుడి తమ్ముడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.